క్లుప్తంగా

కులగణన సర్వే పూర్తి చేయాలి



కులగణన సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా కులగణన సర్వేని వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని హిమకుంట్ల గ్రామంలో కులగణన సర్వేని ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వర్ సమస్య ఉన్నప్పటికి సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు పల్లె నిద్ర చేసి కలెక్టర్ ఆదేశాల మేరకు వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, వలంటీర్లు పాల్గొన్నారు.

భానుకోటలో రామాయణ పఠనం



రామాయణ పఠనంలో భాగవత భక్త సమాజ మండలి సభ్యులు

సింహాద్రిపురం : ఆయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని సింహాద్రిపురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు శివయ్యస్వామి, భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి రామాయణ పఠనం నిర్వహిస్తున్నారు. ఈ రామాయణ పఠనం 21 రోజులపాటు జరుగుతుందని.. భక్తులు పాల్గొని రామాయణ పఠనం విని శ్రీరాముని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారులకు షీల్డ్‌తో పాటు నగదు బహుమతిని అందజేస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : స్థానిక జడ్పీ హైస్కూల్ ఈనెల 13 నుంచి జరిగిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు మండల వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ క్రీడలను మల్లేపల్లె వాసు, నీరుగట్టు ఈశ్వరయ్యలు నిర్వహించారు. మొదటి బహుమతిని దేవరగుట్టపల్లె రాయల్స్ టీంకు షీల్డ్‌తో పాటు రు.30,116లు, ద్వితీయ బహుమతిని లోకల్ టీంకు 20,116లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ది సీరీస్ లకింద రూ.1500ల చొప్పున అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 టీంలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌కు గండి కొవ్వూరు, చక్రాయపేట సర్పంచులు మోపూరి కిరణ్‌కుమార్ రెడ్డి, హర్షాద్, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదంలు చేయూత నిచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీబాలకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, మండల సమన్వయ కర్త ఓబుళరెడ్డి, పట్టెం ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు చేసిన ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలి



ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ రమేష్

లింగాల : పంట సాగు చేసిన ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వెలిదండ్ల రైతు భరోసా కేంద్రంలో రబీ సీజన్‌లో పంట నమోదైన రైతులు ఈకేవైసీ జరుగుతున్న ప్రక్రియను ఏఓ రమేష్ పరిశీలించి మాట్లాడారు. రబీ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు యొక్క పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేయడం జరిగిందని.. ఇంకా ఎవరైనా పంట సాగు చేసి ఈ–క్రాప్ బుకింగ్ కానీ యెడల సంబంధిత ఆర్‌బీకే సిబ్బందిని కలిసి పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈకేవైసీ అయితేనే పంటకు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, తదితర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు.

రేపు ఎంపీ, ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం వీరపునాయునిపల్లె మండలంలో పర్యటించనున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అనిమెల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, 8.30 గంటలకు ఉరుటూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను వారు ప్రాంభిస్తారన్నారు. అనంతరం 10 గంటలకు వీరపునాయునిపల్లెలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

మహిళలకు బాసటగా వైఎస్సార్ ఆసరా



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



జమ్మలమడుగులో మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మహిళలకు బాసటగా వైఎస్సార్ ఆసరా పథకం నిలిచిందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం లక్షలాది మంది స్వయం సహాయక సంఘాల మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. త్వరలో ఎన్నికలు వస్తున్న తరుణంలో టీడీపీ చెప్పే మోసపూరిత మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో చూపించిన వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాను మూడవసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, మండలంలోని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం 558 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు వైఎస్సార్ ఆసరా కింద రూ.4.95 కోట్ల విలువైన మెగా చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కళాయాదవ్, ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, సర్పంచులు సురేంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నారే నాగరాజు, నాయకులు శ్రీరామిరెడ్డి, కోగటం లక్ష్మినారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ

కొలుములపల్లె పంచాయతీ పరిధి దౌలతాపురంలో సిమెంటురోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి భూమి పూజ చేసి మాట్లాడారు. జిల్లా మినరల్ ఫండ్ రూ.9.30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేశామన్నారు. మండలంలో ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, తాగునీరుకు అధిక ప్రాధాన్యత నిస్తామన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : డ్వాక్రా సంఘాల సభ్యులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం సంబరాలను బుధవారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు సంబంధించిన రుణ మాఫీని నాలుగు దశల్లో చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు నేడు నాలుగో విడత రుణమాఫీ మహిళల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. గతంలో 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు మహిళలకు సంబంధించిన రుణాలను మాఫీ చేస్తానని చెప్పి మాట తప్పి మహిళలను మోసం చేశారన్నారు. తీసుకున్న అప్పులకు బ్యాంకుల్లో డబ్బులు చెల్లించకపోవడంతో మహిళలు తాళిబోట్లు, కమ్మలు అమ్ముకుని బ్యాంకులకు వడ్డీతో సహా చెల్లించుకున్నారన్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు అన్ని ఫ్రీ అంటూ ముందుకు వస్తున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలకు నిరంతరం దగ్గరుండి సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్ వ్యవస్థను టీడీపీ అధికారంలోకి వస్తే తీసేస్తుందన్నారు.

అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ ఏడాదిలో ప్రతినెల ఏదో ఒక సంక్షేమం పేరుతో ప్రజలకు వారి ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైఎస్ చైర్మన్ సింగరయ్య, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

పులివెందుల ఎస్ఈబీ సీఐగా రవిచంద్ర



పులివెందుల రూరల్ : పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం(ఎస్ఈబీ)లో సీఐగా రవిచంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా ఎస్ఈబీ కార్యాలయంలో పనిచేస్తున్న రవిచంద్ర బదిలీపై పులివెందులకు వచ్చారు. అలాగే అన్నమయ్య జిల్లా కోడూరులో ఎస్ఈబీ ఎస్ఐగా పనిచేస్తున్న నరసింహారావు పులివెందులకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా నాటుసారా విక్రయాలు జరుగుతుంటే వెంటనే మాకు సమాచారాన్ని అందించాలన్నారు.

ఎర్రగుంట్ల ఎస్ఈబీ సీఐగా లీలారాణి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఎస్ఈబీ సీఐగా లీలారాణి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన సీఐ సురేష్ రెడ్డి పలమనేరుకు బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో ఎస్ఈబీ సీఐగా పనిచేస్తున్న సీఐ లాలరాణి ఎర్రగుంట్ల ఎస్ఈబీకి బదిలీ అయ్యారు. అలాగే చిత్తూరులోని డీటీఎఫ్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యంను ఎస్ఈబీ ఎస్ఐగా ఎర్రగుంట్లకు బదిలీ చేశారు.

అవసరానికి మించి ఎరువులు వాడవద్దు



కోట్లూరులో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వల్లూరు : పంటల్లో అవసరానికి మించి ఎరువులు వాడటం అనర్థదాయకమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీకృష్ణ తెలిపారు. వల్లూరు మండల పరిధిలోని కోట్లూరు గ్రామంలో సాగు చేసిన వరి పంటను జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించి మాట్లాడారు. వరి పంట సాగులో అవసరానికి మించి రసాయన ఎరువులను వాడటంతో పాటు కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేయడం వలన పంటను కాండం కుళ్లు తెగులు ఆశించి సల్ఫైడ్ ఇంజూరీతో మొక్కలు చనిపోతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీని నివారణకు గానూ రైతులు పంట పొలంలో నీటిని పూర్తిగా తీసి వేసి రెండు రోజుల పాటు ఎండబెట్టాలని తెలిపారు. దీంతో బాటుగా ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీ చొప్పున లేదా హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి 2 మిల్లీ చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ పొలంలో మురుగు నీటిని తీసి వేయడానికి తప్పని సరిగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరైన పంట రకాలను ఎంపిక చేసుకోవాలని, మూడు పంటలకు ఒక సారి తప్పని సరిగా జింక్ సల్ఫేట్‌ను వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి సాయిజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

నేడు తొండూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు

తొండూరు : స్థానిక గంగాదేవిపల్లె క్రాస్ రోడ్డు వద్ద వైఎస్సార్ ఆసరా సంబరాలను గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారని ఈ కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై వైఎస్సార్ ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందిస్తారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. మండలంలోని డ్వాక్రా సంఘాలలో ఉన్న 4వేల మంది డ్వాక్రా మహిళలు ఈ సంబరాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే తొండూరు, మల్లేల గ్రామ సచివాలయాల సముదాయాలను ఎంపీ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

అందరికీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు : ప్రజలందరికీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద ఉన్న అర్బన్‌హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన వైద్య సేవలను ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



గడికోట జలాల్లో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

కొండాపురం : మత్స్యకారులకు బీమాతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి సీఎం వైస్ జగనన్న పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ లక్ష్మీదేవి తెలిపారు. మత్స్యశాఖ ద్వారా గడికోట వెనుకజలాల్లో 2 లక్షల చేపపిల్లలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సాయిప్రత్యూష, మత్స్యశాఖ డీడీ శాంతి వదిలారు. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పకుండా లైసెన్సు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. చేప పిల్లలు వదలడం వల్ల స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి ఉంటుందన్నారు. మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓ యువతా మేలుకో...

నవసమాజ నిర్మాణం కోసం విద్యార్థుల భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్: యువత చైతన్యవంతం అయినప్పుడే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని జీవనజ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ వై.అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. నవ సమాజ నిర్మాణం కోసం భావితరాల ఉజ్వల భవిష్యత్ కోసం యువత, విద్యార్థులతో జీవనజ్యోతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వన్‌టౌన్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీరోడ్డు, విజయకుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలతో పెడతోవ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వడం వల్ల వారు దుర్వినియోగం చేయడంతో పాటు దానికి వ్యసనంగా మారుతున్నారన్నారు. మోటార్ సైకిళ్లు ట్రిపుల్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవడంతో పాటు తల్లిదండ్రులకు శోకం మిగిలిస్తున్నారన్నారు. యువత బెట్టింగులు, మద్యం, ధూమపానం వంటి చెడు అలవాట్లతో ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉండాలని, ఎక్కడ తిరుగుతున్నారో గమనిస్తూ ఉండాలన్నారు. క్షణికానందం, క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటూ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారని.. ఇది తగదన్నారు. తల్లిదండ్రుల శ్రమను, కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో మెలిగి ఉన్నత మైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో జీవనజ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, పలు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగ కుండా బందోబస్తు నిర్వహించారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9963170177, 08568286189 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుశీల

వేముల : ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించేలా కృషి చేయాలని అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుశీల తెలిపారు. బుధవారం స్థానిక వేముల టీటీడీ కల్యాణ మండపంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని సీఎస్ పురం, కదిరి బాబురావు కళాశాల విద్యార్థులు మూడు నెలలుగా అరటి పరిశోధన స్థానం ఆధ్వర్యంలో గ్రామీణ ఉద్యాన పంటలపై పరిశోధన చేశారన్నారు. పులివెందుల డివిజన్‌లోని వేముల, పెద్దరంగాపురం, ఇప్పట్ల గ్రామాలలో రైతులకు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. సాగులో ఉన్న పంటలకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించడంవల్ల ఖర్చుల ఆదాతోపాటు దిగుబడులను పెంచుకోవచ్చునన్నారు. అరటి పంటకు సోకే తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవల్ల కానీ, అధిక వర్షాలవల్ల కానీ అరటికి తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని.. రైతులు ముందు జాగ్రత్తలు పాటించడంవల్ల తెగుళ్లను నివారించుకోవచ్చునన్నారు. అరటిలో పెరుగుతున్న పెట్టుబడుల దృష్ట్యా రైతులు ఉద్యాన శాఖ అధికారుల ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అలాగే రైతుల వివిధ సందేహాలకు శాస్త్రవేత్తలు వివరంగా సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ టి.వీరన్న గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అఖిల్ బాబు, శాస్త్రవేత్తలు డాక్టర్ నాగేంద్రారెడ్డి, సునీల్, వేముల వీహెచ్ఓ హారిక, వీఏఏ అభిలాష్‌రెడ్డి, అరటి రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు



పులివెందుల : ఖోఖోలో రన్నర్స్‌గా నిలిచిన లయోలా పాల్‌టెక్నిక్ కళాశాల జట్టు



కమలాపురం నియోజకవర్గంలో మ్యాచ్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని జెఎన్‌టీయూ క్రీడా మైదానం, వైఎస్సార్ క్రీడా మైదానంలో నియోజకవర్గస్థాయి ఆడుదాం.. ఆంధ్రా పోటీలను బుధవారం ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలలో క్రీడాకారులు పాల్గొని పోటాపోటీగా ఆడారు. ఖోఖో బాలికల విభాగంలో విన్నర్స్‌గా వేంపల్లె సచివాలయ జట్టు నిలవగా.. పులివెందుల నగరిగుట్ట సచివాలయం (లయోలా పాల్‌టెక్నిక్ కళాశాల విద్యార్థులు) జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అలాగే ఖోఖో బాలుర విభాగంలో విన్నర్స్‌గా నగరిగుట్ట సచివాలయం, రన్నర్స్‌గా వేంపల్లె సచివాలయ జట్లు నిలిచాయి. సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వేంపల్లె ఎంపీడీఓ దివిజ, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

కమలాపురం : క్రీడల్లో గెలుపోటములు సహజం అని, క్రీడలతో శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను పొందవచ్చని, ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సీఎస్ఐ చర్చ్ మైదానంలో జరిగిన ఆడుదాం..ఆంధ్ర నియోజకవర్గస్థాయి పోటీలను ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి బ్యాటింగ్ ఆడి ప్రారంభించి మాట్లాడారు. ఏ ప్రభుత్వం ఇలా క్రీడా పోటీలను నిర్వహించలేదన్నారు. ప్రతి అంశంలో కమలాపురం నియోజకవర్గ జట్టు రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సచివాలయ స్థాయి నుంచి జగనన్న క్రీడా పోటీలు నిర్వహించారన్నారు. నియోజకవర్గ, మండల స్పెషలాఫీసర్లు యదు భూషణ్‌రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు ప్రైజ్ మనీ ప్రకటించిందని, ఆ బహుమతులకు మరో రూ.65వేలు, రూ.35వేలు, రూ.20వేలు ఎమ్మెల్యే సొంత నిధులు జోడించి రూ.1లక్ష, రూ.50 వేలు, రూ.25వేల ప్రైజ్ మనీ ఇవ్వడంతో పాటు క్రీడాకారులకు భోజన వసతి కల్పించడం హర్షణీయం అన్నారు. ఈ ఏపీడీ సోశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ రాముడు, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..


జమ్మలమడుగు : పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను బుధవారం ఆర్డీఓ జి.శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు.

గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి మంచి ప్రోత్సాహం అందించేందుకే ఈక్రీడలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, పీఈటీ మురళి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు గ్రామ సచివాలయం క్రికెట్ జట్టు నియోజకవర్గ స్థాయి ఫైనల్‌కు ఎంపికైనట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. ముద్దనూరు, పెద్దముడియం మండలాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించగా సెమిఫైనల్‌కు లావనూరు జట్టు ఎంపికై ందన్నారు. దత్తాపురం బాలికల టీమ్ బ్యాడ్మింటన్‌లో రన్నర్‌గా నిలిచింది. ఏటూరు గ్రామం ఖోఖోలో నియోజకవర్గస్థాయి ఫైనల్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జేవీవీ జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా

పులివెందుల టౌన్ : బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి పి.సనావుల్లా తెలిపారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవ వేడుకలలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జేవీవీ జాతీయ సమాచార కార్యదర్శి సనవుల్లా హాజరై మాట్లాడుతూ ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం, సంరక్షించుకుందామని, భవిష్యత్ తరాలకు అమ్మ కావాలన్నా, విషయాన్ని అందరం గుర్తిద్దామన్నారు. అనంతరం బాలికలచే జాతీయ బాలికల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఘనంగా జాతీయ ఓటర్ల, బాలికల దినోత్సవాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం, జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు తెలిపారు. జాతీయ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, బాలికలను సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. అలాగే బేటీ బచావో.. బేటీ పడావో పథకం యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఈఆర్ఓ చంద్రమోహన్

కమలాపురం : అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న తుది నియోజకవర్గ ఓటర్ల కొత్త జాబితా వచ్చిందని ఇందులో 2,00,222 మంది నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఈ జాబితాలో కూడా ఏవైన తప్పులు ఉంటే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఫిర్యాదులు లిఖిత పూర్వకంగా ఇవ్వవచ్చని, అన్ని ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. 1500 ఓట్లు కంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని రెండు పోలింగ్ కేంద్రాలుగా విభజిస్తామన్నారు. ప్రస్తుతం సీకే దిన్నె మండలం విశ్వనాథపురంలో 1500 మంది ఓటర్లు ఉన్నారని, ఆ పీఎస్‌ను రెండుగా చేస్తామన్నారు. ఇంకా ఇలాంటి పీఎస్‌లు ఉంటే తప్పకుండా విభజన చేస్తామన్నారు. నామినేషన్ వేసే చివరి రోజు కూడా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.